క్లుప్తంగా

నేడు మార్కాపురంలో కోటి సంతకాల సేకరణ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా..

మార్కాపురం టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీల్లో 10 కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు ఆ పార్టీ మార్కాపురం మండల అధ్యక్షుడు పోరెడ్డి చెంచిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు మార్కాపురం మండలంలోని బోడపాడు గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



ప్రింటింగ్ మెటీరియల్‌తో నాయకులు

తర్లుపాడు: మండలంలోని సూరేపల్లి ఎంపీపీ పాఠశాలకు ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన తాడి కాశిరెడ్డి ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. విద్యార్థులకు అవసరమైన వర్క్ షీట్లు రూపొందించేందుకు ప్రింటర్ ఉపయోగపడుతుందని హెచ్‌ఎం నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. దాతను గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ నవ్య రమణయ్య, పీఎంసీ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు నాగ తిరుపతయ్య, ఉపాధ్యాయులు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కొనకనమిట్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి పేర్కొన్నారు. బుధవారం పోషకాహార ఆవశ్యకతపై మండలంలోని చినమనగుండం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. జంక్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఐటీసీ జిల్లా కోఆర్డినేటర్ వెంకటరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో ఆర్గానిక్ పిండి వంటలు, నూనెలు, బిస్కట్లు, కూరగాయలు విక్రయిస్తున్నారని, వాటితో తయారు చేసిన ఆహారాన్ని పిల్లలకు పెట్టాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధిగా 'ఏలూరి'

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డిని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన హైదరాబాద్‌లో ఎస్‌ఆర్‌ఎస్ ల్యాబొరేటరీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా గురువారం కర్నూలులో నిర్వహిస్తున్న ప్రధాని మోదీ సభలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బేస్తవారిపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏపీ రంగనాయకులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని స్పష్టం చేశారు.

ముందే పేలిన ముడుపుల టపాసు!



ఆమ్యామ్యాలు ముట్టజెబితేనే దీపావళి బాణసంచా స్టాల్‌కు అనుమతి

- లంచం గుంజేందుకు వ్యాపారులను తిప్పకుంటున్న అధికారులు
- దరఖాస్తుదారుల ముక్కుపిండి మరీ వేల రూపాయల్లో వసూళ్లు
- ఒక్కో దుకాణదారుడిపై 30 వేల రూపాయల వరకు అదనపు భారం
- బాణసంచా ధర పెంచి నష్టం పూడ్చుకునేందుకు సిద్ధమైన వ్యాపారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్:

మరో నాలుగు రోజుల్లో దీపావళి పండగ. ఆ రోజు పేలే టపాసుల సంగతి కాస్త పక్కన పెడితే అధికారుల ముడుపుల బాంబు ముందే పేలింది.! దీపావళిని పురస్కరించుకుని తాత్కాలిక బాణసంచా దుకాణం ఏర్పాటు చేసుకోవాలంటే వ్యాపారులంతా ముడుపులు ముట్టజెప్పాల్సిందేనని సంబంధిత శాఖ అధికారులు హుకుం జారీ చేయడం గిద్దలూరు నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అడిగినంత ఇచ్చుకోలేని వ్యాపారులు దుకాణాల అనుమతి కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తుండటం గమనార్హం. ఈనెల 19, 20, 21 తేదిలలో తాత్కాలిక క్రాకర్స్ దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అగ్నిమాపకశాఖ మొదలు మండల కేంద్రంలోని ప్రతి కార్యాలయంలో వేల రూపాయల నగదును సంబంధిత అధికారులకు లంచాల రూపంలో ముట్టజెప్పనిదే పని జరగని పరిస్థితి ఏర్పడింది. ఒక్కో స్టాల్‌కు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు లంచం ఇవ్వక తప్పడం లేదని వ్యాపారులు ఘొల్లుమంటు

గిద్దలూరు నియోజకవర్గంలో దుకాణాల దరఖాస్తుల వివరాలు (అక్టోబర్ 15వ తేదీ వరకు)

మండలం	దుకాణాల సంఖ్య
గిద్దలూరు	23
రాచర్ల	1
కొమరోలు	6
కంభం	5
బేస్తవారపేట	4
అర్ధవీడు	1



గిద్దలూరు అగ్నిమాపకశాఖ కార్యాలయం

ప్రతి శాఖకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు

గిద్దలూరు అగ్నిమాపక శాఖ కార్యాలయ పరిధిలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాలు, కంభం అగ్నిమాపకశాఖ పరిధిలో కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాలు ఉన్నాయి. క్రాకర్స్ దుకాణాల కోసం అనుమతి పొందడానికి ముందుగా చలానా కట్టి అగ్నిమాపక శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఇక్కడ ఒక్కో దరఖాస్తుదారుడి వద్ద రూ.5 వేల నుంచి రూ.7 వేలు గుంజుతున్నట్లు ఆరోపణలున్నాయి. అనంతరం ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కనీసం రూ.2 వేలు, గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయంలో రూ.5 వేలు ముట్టజెప్పాల్సి వస్తోందని, స్థానిక పోలీసుస్టేషన్లలో రూ.10 వేల వరకు, తహసీల్దార్ కార్యాలయాల్లో రూ.5 వేల వరకు ఇవ్వాల్సి వస్తోందని వ్యాపారులు బహిరంగంగా చెబుతుండటం చర్చనీయాంశంగా మారింది. అధికారులు అడిగినంత ఇచ్చుకున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతూ కాలయాపన చేస్తున్నారని వ్యాపారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు చూస్తుంటే తమకు అనుమతి ఇస్తారో, ఇవ్వరో అని పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య విద్యను పేదలకు దూరం చేసే కుట్ర

- మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం దుర్మార్గం
- కూటమి నేతలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి దోపిడీకి అర్రులు చాస్తున్నారు
- చంద్రబాబు తీరుపై మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల ధ్వజం
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొనకనమిట్లలో కోటి సంతకాల సేకరణ



కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు,



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: పేద విద్యార్థులు సైతం వైద్య విద్య చదువుకునేందుకు, పేద, మధ్య తరగతి ప్రజలు మెరుగైన వైద్యం పొందేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుడితే.. కూటమి ప్రభుత్వం మాత్రం ప్రైవేట్ పరం చేసి దోపిడీకి తెరలేపుతోందని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానం ప్రైవేట్ పరం చేసే కుట్రను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం కొనకనమిట్లలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో కలిసి అన్నా రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మార్కాపురంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. మాయ మాటలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర స్థాయిలో అసంతృప్తి రగులుతోందన్నారు. ప్రజా పాలన గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించటమే పనిగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని దుయ్యబట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ విజయవంతంగా నిర్వహిద్దామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ముందుగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటి సంతకాల సేకరణలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ అధ్యక్షులు మోరా శంకర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, కొనకనమిట్ల పార్టీ నాయకులు యక్కంటి తిరుపతిరెడ్డి, పగడాల వెంకటేశ్వరరెడ్డి భూషణం, మెట్టు అల్లూరురెడ్డి, వేంపాటి తిరుపతిరెడ్డి, సుబ్బారెడ్డి, పునుగోటి అంజిరెడ్డి, జిల్లా పార్టీ పలు విభాగాల కార్యవర్గ సభ్యులు ఏలూరి సంజీవరెడ్డి, తంగిరాల బ్రహ్మారెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు, మంచికల కోటేశ్వరరావు, పావులూరి వెంకటేశ్వర్లు, పార్లపల్లి సిద్దానబి, బోయిన వెంకటేశ్వర్లు, గోనుగుంట్ల శ్రీనివాసులు, నాగం ప్రసాద్, మారావత్ వెంకటేశ్వర్లు, జె.ఇస్రాయేలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఉడిపి నుంచి అయోధ్యకు పాదయాత్ర

- విశ్వశాంతి కోసమేనని లక్ష్మీపతి స్వామీజీ వెల్లడి



మార్కాపురం: విశ్వ శాంతి కోసం, హిందూ సనాతన ధర్మం కోసం ఉడిపి నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేస్తున్నట్లు ఉడిపికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త లక్ష్మీపతి స్వామీజీ తెలిపారు. బుధవారం మార్కాపురం చేరుకున్న ఆయన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞోపవీతం పత్రిక ఎడిటర్ ఓఏ మల్లిక్ నివాసానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్ల వయసులో రోజూ 30 కిలోమీటర్లు నడుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కర్నాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణలో పాదయాత్ర సాగిందని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వర్గవైషమ్యాలు వీడి కలిసి ఉండాలని ఆకాంక్షించారు.

మర్రిపాలెం జెడ్పీహెచ్‌ఎస్‌కు సైన్స్ కిట్లు



సైన్స్ కిట్లతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొనకనమిట్ల: బయాలజీ, ఫిజికల్ సైన్స్ తరగతులకు సంబంధించి విద్యార్థులకు ప్రయోగాలు చేసి చూపించేందుకు అవసరమైన సెకండరీ స్టేజ్ సైన్స్ కిట్లను మండలంలోని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు అందజేసినట్లు హెచ్‌ఎం నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సైన్స్ టీచర్స ఎం.రామాంజనేయులు, ప్రతిమల పర్యవేక్షణలో విద్యార్థులకు సైన్స్ కిట్లపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాచర్ల: ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నేపథ్యంలో రాచర్ల, యడవల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ బీవై శేషగిరిరావు, ఏఈ బాలగురవయ్య తెలిపారు. రాచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే యడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అబ్దుల్ కలాం జీవితం అందరికీ ఆదర్శం



కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వెన్నా హనుమారెడ్డి,



గిద్దలూరులో డాక్టర్ అబ్దుల్ కలామ్‌కు నివాళులర్పిస్తున్న ముస్లింలు

మార్కాపురం: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జీవితం యువతతోపాటు ప్రజలందరికీ ఆదర్శమని వైఎస్సార్ సీపీ ఎస్‌ఈసీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. »కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి« అని చెప్పిన కలాం సూక్తిని యువత ఆచరించాలని వెన్నా సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్‌బాబు, నర్సింగ్ ప్రిన్సిపాల్ విజయకుమారి, డీన్ డాక్టర్ చంద్రరేఖ, డిప్లొమా ఇన్‌చార్జి మాధవి, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మిసైల్ మ్యాన్‌గా పేరొందిన కలాం దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ అనీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ముస్లిం మైనార్టీ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో బుధవారం గిద్దలూరులోని అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. మిసైల్ మ్యాన్ కలాంను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశాన్నే కుటుంబంగా భావించి కలాం ఆదర్శవంతమైన జీవితం గడిపారని కొనియాడారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సంఘం సభ్యులు మౌలానా, అబ్దుల్, చాంద్‌బాషా, అలీబాషా, సయ్యద్ నాయబ్‌రసూల్, ఉస్మాన్, హక్ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం జగన్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ డి.సుజాత ముఖ్యఅతిథిగా పాల్గొని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతీయ అంతరిక్ష పరిశోధనలో కలాం సాధించిన విజయాలను విద్యార్థులకు ఎంఈఓ వివరించారు. నేటి యువత, ముఖ్యంగా విద్యార్థులు కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకునిని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని అనూష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తర్లుపాడు : కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ సుజాత, హెచ్‌ఎం జగన్‌బాబు

చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



బేస్తవారిపేటలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఫాదర్ రంగయ్య



కంభంలో చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలో బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో గురువారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతుల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని చర్చి ఫాదర్ గుర్రం జాన్‌బీ రంగయ్య పేర్కొన్నారు. చేతులను శుభ్రం చేసుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు ప్రశాంతి, అనిత పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రత తప్పనిసరి

కంభం: చేతుల పరిశుభ్రతతో ఆరోగ్య భద్రత పొందవచ్చని ఎంపీడీఓ వీరభద్రాచారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు రకాల వ్యాధుల ముప్పును తప్పించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్, పీడీలు సుబ్రహ్మణ్యం, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రమణారెడ్డి, పాండురంగబాబు, మస్తాన్ పాల్గొన్నారు.



తర్లుపాడు : గ్లోబల్ హ్యాండ్ వాష్ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం మౌలాలి ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. రోజూ భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు హెచ్‌ఎం సూచించారు. తద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఉపాధ్యాయురాలు అలివేలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించండి

మార్కాపురం టౌన్: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం దరిమడుగు గ్రామంలో కిసాన్ గోష్టి కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు గమనించి అందుకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయ విధానాలను పాటించాలని, తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందాలన్నారు. వ్యవసాయాధికారుల సూచన మేరకే ఎరువులు వాడాలని చెప్పారు. అపరాల్లో వచ్చే తెగుళ్లు, చీడ పీడల నివారణ చర్యల గురించి ఏడీఏ బాలాజీ నాయక్ వివరించారు. ఏఓ బుజ్జిబాయి, ఆత్మ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ వాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

మార్కాపురంలో మోస్తరు వర్షం

మార్కాపురం: పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరు వర్షం కురిసింది. గత 2 రోజుల నుంచి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం పత్తి, మిర్చి, కంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా మంగళవారం అర్ధరాత్రి పశ్చిమ ప్రకాశంలోని పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అర్ధరాత్రి 2 నుంచి 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.



మార్కాపురంలో కురుస్తున్న వర్షం